సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం। 2। జనవరి। 2025



మామిడికి మంచు దెబ్బ

రెండు వారాలుగా మంచు కురుస్తుండటంతో మామిడి తోటలు మంచు దెబ్బకు విలవిల్లాడుతున్నాయి. పూత, పిందె మాడిపోతుందేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 8లో ▸



చిన్న మిల్లులకు పెద్ద కష్టం

చిన్న మిల్లుకు పెద్ద కష్టమొచ్చింది. ధాన్యం సేకరణ లక్ష్యం తగ్గిపోగా.. మిల్లింగ్ సామర్థ్యం మేరకు రైస్ కేటాయింపులు వాటి మనుగడపై ప్రభావం చూపనుంది. 8లో ▸



పోటెత్తిన భక్తులు

నూతన సంవత్సరం తొలిరోజున చినవెంకన్న దివ్య క్షేత్రం భక్తులతో పోటెత్తింది. తెల్లవారుజాము నుంచే భక్తుల రాకతో క్షేత్ర పరిసరాల్లో సందడి నెలకొంది. 8లో ▸

ఇంగ్లిష్ మీడియంపై కుట్ర

ఇంగ్లిష్ మీడియం విద్య అందరికీ అందుబాటులో తేవాలన్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యాన్ని ఉద్దేశపూర్వకంగా నీరుగార్చేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. పేదలు చదివే ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియంకు మంగళం పాడే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రపంచ తెలుగు రచయితల మహాసభల వేదికగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధనపై జరిగిన దాడి అనేక అనుమానాలకు ఊతమిస్తోంది. రాష్ట్రంలో మొదలైన విద్యావిప్లవాన్ని మళ్లీ వెనక్కి నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ మేధావులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

- పేదల పిల్లలు తెలుగులోనే చదవాలా..?
- ప్రపంచ తెలుగు రచయితల మహాసభల వేదికగా ఇంగ్లిష్ మీడియంపై దాడి
- ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం జీఓ రద్దుకు వినతి
- వ్యతిరేకిస్తున్న వివిధ వర్గాలు

సాక్షి, భీమవరం : విజయవాడలోని కేబీఎన్ కళాశాలలో గత నెల 28, 29 తేదీల్లో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు జరిగాయి. పలువురు ప్రముఖులు మాట్లాడుతూ మాతృభాషను కాపాడేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ఎత్తివేయాలని, ఇంగ్లిష్ మీడియం బోధించేందుకు గత ప్రభుత్వం తెచ్చిన జీవో 85ను రద్దుచేయాలని కోరడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇంగ్లిష్ మీడియంకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న పెద్దలు తమ పిల్లలు, మనువలను ఏ తెలుగు మీడియం పాఠశాలల్లో చదివించారని చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ వర్గాలు వారి తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఇంగ్లిషు మీడియంతో పాటు



ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

తెలుగు మీడియంను కొనసాగించేలా పాలకులు ఒత్తిడి తేవాలని సూచిస్తున్నారు.

పేద విద్యార్థులు పోటీపడేలా..

బిడ్డల మంచి భవిష్యత్తుకు వారిచ్చే నిజమైన ఆస్తి విద్యేనని ప్రతి తల్లీ, తండ్రి భావిస్తారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో తమ పిల్లలు ఎక్కడకు వెళ్లి బతకాలన్నా, అవకాశాలను అందుకోవాలన్నా అందుకు ఇంగ్లిష్ తప్పనిసరనేది జగమెరిగిన సత్యం. అందుకోసం తమకు ఫీజులు చెల్లించే స్తోమత లేకున్నా అప్పులు చేసైనా ప్రైవేట్ పాఠశాలల్లో చేరిస్తుంటారు. తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా పేద వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను ఇవ్వడమే లక్ష్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పనిచేశారు. పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వం పాఠశాలల్లోనే ఇంగ్లిష్ మీడియం విద్యకు శ్రీకారం చుట్టారు.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 2710 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 2.26 లక్షల మంది విద్యార్థులు విద్యాభ్యాసం సాగిస్తున్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించడంతో పాటు .. వారు ప్రపంచంతో పోటీ పడేలా ఇంగ్లిష్ విద్యను అందించాలని 2020–21 విద్యా సంవత్సరం నుంచి ఒకటి నుంచి 6వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంను ప్రారంభించారు. కార్పొరేట్‌కు కొమ్ముకాస్తూ గత పాలకులు విద్యను నిర్లక్ష్యం చేయడంతో అధోగతి పాలైన ప్రభుత్వ విద్యా వ్యవస్థను గాడిన పెట్టారు. పాఠశాలలకు నాడు–నేడులో రూ.కోట్లాది రూపాయలు వెచ్చించి కొత్త రూపు తెచ్చారు. ఏటా

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో..

ఒక్కో తరగతిని పెంచుకుంటూ 2024–25 నాటికి 10వ తరగతిని ఇంగ్లిష్ మీడియంలోకి మార్చేలా కార్యాచరణ అమలుచేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు సాంకేతిక విద్యను అందుబాటులోకి తెస్తూ ఏటా 8వ తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బైజూస్ కంటెంట్‌తో రూ.30 వేలు విలువచేసే ట్యాబ్‌లు అందిస్తూ వచ్చారు. తరగతి గదుల్లో డిజిటల్ విద్యను అందించేందుకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ), స్మార్ట్ టీవీలు అందజేశారు. దేశంలోనే తొలిసారిగా బైలింగ్వల్ (మిర్రర్ ఇమేజ్), ప్రైమరీ విద్యార్థులకు పిక్టోరియల్ డిక్షనరీ, హైస్కూల్ విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను అందించారు. వాటి ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లోని ఎంతోమంది విద్యార్థులు 10వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో 590కు పైగా మార్కులతో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు సవాల్ విసిరారు. నాడు దివంగత వైఎస్ ఫీజు రీయింబర్స్‌మెంట్ తెచ్చి పేదల పిల్లల ఉన్నతికి బాటలు వేస్తే.. తండ్రిని మించిన తనయుడిగా ఎన్నో సంస్కరణలతో పేదల బతుకుల్లో విద్యాకాంతులు నింపిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్ దక్కించుకున్నారు.

పశ్చిమ గోదావరి	
పాఠశాలలు	విద్యార్థులు
1,340	98,000
ఏలూరు	
పాఠశాలలు	విద్యార్థులు
1,370	1,28,366

జగన్ సర్కారులో విద్యా విప్లవం



జగన్ సర్కారులో ప్రభుత్వ బడుల్లో విద్యా విప్లవం వచ్చింది. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పాటు విదేశీయులు సైతం ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం తీసుకురావడం, తరగతి గదులను డిజిటలైజేషన్ చేయడం వంటి మార్పులను స్వాగతించారు. కూటమి ప్రభుత్వం నీరుగార్చేలా చేస్తుంది.

– కాగిత సత్యవాణి, నర్సాపురం

ఆంగ్ల భాషకు ప్రాధాన్యమివ్వాలి



ఇటీవల జరిగిన తెలుగు మహాసభల్లో తెలుగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరడం సబబే. ఈ వంకతో ఆంగ్ల భాషను తొలగించాలనడం సరికాదు. తెలుగుకు ప్రాధాన్యతనిస్తూనే ఆంగ్ల భాషను కూడా కొనసాగించాలి. నేడు ఏ ఉద్యోగంలోకి వెళ్లాలన్నా ఆంగ్లభాష ఉండాల్సివస్తుంది.

– బాకూరి సత్యనిరంజన్‌రావు, పాలకొల్లు

మేధావులు మారాలి



కూటమి ప్రభుత్వం వచ్చిన 6 నెలల్లో టోఫెల్, సీబీఎస్‌ఈ స్కూళ్లను రద్దు చేసింది. సుమారు 2 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుగలకు దూరమయ్యారు. తెలుగు మీడియం కోరుకునే మేధావులు తమ పిల్లలను, మనవళ్లను ఏ మీడియంలో చదివిస్తున్నారో గుర్తు చేసుకోవాలి.

– ఎస్.వి.జాకబ్ బాబు, స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి

తిరోగమనంలో విద్యా వ్యవస్థ



కూటమి ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ తిరోగమనంలో ఉంది. పేద, మధ్య తరగతి పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో విద్యను అందించాలనే సంకల్పంతో గత ప్రభుత్వం కృషి చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిగా ఇంగ్లిష్ మీడియంను రద్దు చేయాలనుకోవడం సమంజసం కాదు.

– పెన్మెత్స రామరాజు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, తణుకు

ఆంగ్ల విద్యకు మద్దతు పలకాలి



ప్రాథమిక స్థాయిలో ఇంగ్లిషు బోధనతో ఉన్నత చదువులు పేదవాడికి మరింత దగ్గరవుతాయి. అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది. ప్రభుత్వం ఆంగ్ల విద్యా బోధనపై సమీక్ష చేయాలి. మేధావులు మద్దతు తెలపాలి.

– కోన జోసెఫ్, ఏలూరుపాడు

విద్యార్థుల జీవితాలతో చెలగాటం



ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న ఇంగ్లిష్ మీడియం విద్యకు సంబంధించిన జీఓ నెం.85ను రద్దు చేయాలని కొందరు పెద్దలు కోరడం సమంజసం కాదు. ఇది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడినట్లే. పిల్లల్ని ఏ మీడియంలో చదివించుకోవాలనే హక్కు తల్లిదండ్రులకు ఉంటుంది.

– కాండ్రేకుల శ్రీను, నరసన్నచెరువుపాలెం

న్యూస్‌రీల్

కలెక్టర్‌కు శుభాకాంక్షలు



కలెక్టర్ నాగరాణికి పుస్తకం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న జేసీ

భీమవరం (ప్రకాశంచౌక్): నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ నాగరాణికి పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, అడిషనల్ ఎస్పీ భీమారావు, జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పెంపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ అభ్యాసకులకు వచ్చే మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షల నిమిత్తం ఫీజులు చెల్లించడానికి గడువు పెంచి నట్లు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. పదో తరగతిలో ఒక్కో సబ్జెక్టుకు రూ.100, ఇంటర్‌లో థియరీ సబ్జెక్టులు ఒక్కోదానికి రూ.150 చెల్లించాలని తెలిపారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు ఒక్కో సబ్జెక్టుకు రూ.100 చెల్లించాలని సూచించారు. ఈ నెల 6 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజులు చెల్లించవచ్చని, రూ.25 అపరాధ రుసుంతో ఈ నెల 7, 8 తేదీల్లో చెల్లించవచ్చనన్నారు. రూ.50 అపరాధ రుసుంతో ఈ నెల 9న, తత్కాల్ విధానంలో ఇంటర్మీడియట్‌కు రూ.వెయ్యి, పదో తరగతికి రూ.500 అపరాధ రుసుంతో ఈ నెల 10న చెల్లించవచ్చన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి



పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

భీమవరం: పెన్షనర్లు ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో జీవన్ ప్రమాణ్ యాప్‌లో లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని భీమవరం సబ్ ట్రెజరీ ఆఫీసర్ అల్లూరి రవివర్మ చెప్పారు. బుధవారం సబ్ ట్రెజరీ కార్యాలయంలో లైఫ్ సర్టిఫికెట్ల జారీ ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. భీమవరం పరిసర ప్రాంత పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్ల ఆధార్ నంబర్, ఓటీపీ కోసం సెల్ ఫోన్ తీసుకొచ్చి అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

జేఏఓలకు పదోన్నతులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో జూనియర్ అకౌంట్స్ అధికారులుగా పనిచేస్తున్న పలువురికి అసిస్టెంట్ అకౌంట్స్ అధికారులుగా పదోన్నతులు కల్పించారు. ఏలూరులో జేఏఓగా పని చేస్తున్న హరిప్రియను భీమవరానికి, విశాఖపట్నంలో ఏజేఓగా పని చేస్తున్న దుర్గా భాస్కరిని తంగెళ్ళమూడికి బదిలీ చేశారు.

అందరి జీవితాల్లో సంతోషాలు నింపాలి

నరసాపురం: నూతన సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో సంతోషాలు నింపాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని గోదారి రేవు వద్ద ఉన్న ముదునూరి నివాసంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముదునూరి ఉదయం నుంచి ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లాలోని నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ముదునూరి నివాసానికి చేరుకుని నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ ప్రజలు కొత్త ఏడాదిలో కొత్త లక్ష్యాలతో ముందుకెళ్లాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులు పెట్టకుండా, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని సూచించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజుకు శుభాకాంక్షలు చెబుతున్న పార్టీ నేతలు

ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా నిలబడుతుందని చెప్పారు.

ప్రజల పక్షాన పోరాడతాం

మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం: గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉంటే చంద్రబాబు మోసపూరిత హామీలతో ప్రజలను నిండా ముంచారని మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ విమర్శించారు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం ఆయన నివాసం వద్ద మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలతో గత ఏడు నెలలుగా చంద్రబాబు దుర్మార్గ పాలన చేస్తు డ్రామాలాడుతున్నారని దుయ్యబట్టారు. ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయకుండా గాలికి వదిలేశారన్నారు. ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని కొట్టు సత్యనారాయణ స్పష్టం చేశారు.

నూతన సంవత్సర సందడి



మండలి చైర్మన్ మోషేన్ రాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లిం సోదరులు



భీమవరంలో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మకు కేక్ తినిపిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధుల క్యాంపు కార్యాలయాల వద్ద నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి పుష్పగుచ్ఛాలు అందించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు క్యాంపు కార్యాలయం వద్ద వివిధ శాఖల అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు మోషేను రాజుకు పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వేదపండితులు, ముస్లిం మత పెద్దలు ఆశీర్వచనాలు అందించారు. నర్సయ్య అగ్రహారంలోని బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొన్నారు.

● శ్రీవారి క్షేత్రం.. హిమ సోయగం



ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రాన్ని మంచు పరదా కప్పేసింది. ఆలయ రాజగోపురాలు, పరిసరాలు మంచు తిమ్మెరల నడుమ రమణీయంగా మారాయి. బుధవారం ఉదయం 9 గంటల వరకు మంచు వీడలేదు. భక్తులు, సేవకులు పొగ మంచులో నుంచే రాకపోకలు సాగించారు.

– ద్వారకాతిరుమల



ప్రజాపోరుపై దమనకాండ

- పశువధ కర్మాగారంపై తీవ్ర నిరసనలు
- తణుకు మండలం తేతలిలో కర్మాగారం ఎదుట దీక్షా శిబిరం
- చర్చల పేరుతో పిలిచి అక్రమ బైండోవర్ కేసులు
- నిరాహారదీక్ష శిబిరాన్ని భగ్నం చేసిన పోలీసులు
- మరోసారి అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళనలకు సిద్ధం
- ప్రభుత్వ మద్దతుతో లాహం ఫుడ్ పరిశ్రమకు అనుమతులు



తణుకు మండలం తేతలిలోని లాహం ఫుడ్ పరిశ్రమ



పశు వధ కర్మాగారం మూసివేయాలంటూ ఆందోళన చేస్తున్న దృశ్యం(ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ప్రజారోగ్యంపై చెలగాటమాడే పరిశ్రమ వద్దు.. పశువుల వధ తణుకు ప్రాంతానికే అరిష్టం.. రోజూ రక్తం ఎరులైపారి తీవ్ర దుర్గంధం వస్తుంటే ఎలా బతికేదంటూ స్థానికులు గగ్గోలు.. గేదెల వధ పేరుతో గోవులను కూడా వధిస్తున్నారంటూ గో సంరక్షణ సమితి ఆరోపణ.. ఇలా తీవ్ర వివాదంగా మారిన లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ పరిశ్రమకు సర్కారు, స్థానిక ప్రజాప్రతినిధి కొమ్ముకాస్తున్నారు.

ఓట్లు వేసి గెలిపించిన నియోజకవర్గ ప్రజల అభిమతానికి విరుద్ధంగా అడ్డగోలుగా పరిశ్రమలు ఏర్పాటుకు సహకరించడంతో పాటు తారాస్థాయిలో జరుగుతున్న ప్రజా ఉద్యమాన్ని పోలీసు, రెవెన్యూ బలగాలతో అణచివేశారు. ప్రజాపోరాటం చేస్తున్న వారిపై సర్కారు దమనకాండకు తెరదీయడం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీంతో ఉద్యమాన్ని మరింత ఉధృతంగా చేయడంతో పాటు తణుకు కేంద్రంగా రిలే నిరాహారదీక్షలు నిర్వహించేలా సన్నాహాలు చేస్తున్నారు.

టీడీపీ హయాంలో పరిశ్రమకు అనుమతులు

తణుకు మండలంలోని తేతలి గ్రామంలో లాహం ఫుడ్ ప్రొడెక్ట్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో పశువధ కర్మాగారం ఏర్పాటైంది. 2014లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పరిశ్రమ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోగా వెంటనే అనుమతులు మంజూరు చేశారు. 2016లో నిర్మాణం ప్రారంభం కాగా స్థానికులు అడ్డుకుంటూ వచ్చారు. అనేక వ్యతిరేకతలు, ప్రజా నిరసనల్ని కాదని 2018లో నిర్మాణం పూర్తి చేశారు. ఈ క్రమంలో రోజూ 400 గేదెలను వధించి మాంసాన్ని ఎగుమతి చేసే ప్రాసెసింగ్ యూనిట్‌గా అనుమతులు పొందినట్లు చూపారు. పంచాయితీ నుంచి ప్లాన్ అప్రూవ్‌గాని, ఎన్‌ఓసీ గాని తీసుకోకపోవడంతో స్థానికులు, గోసేవా సమితి హైకోర్టులో కేసు దాఖలు చేయడంతో వ్యవహారం పెండింగ్‌లో పడింది. మళ్ళీ 2022లో ట్రయల్‌రన్ పేరుతో ప్రారంభించడానికి ప్రయత్నించగా అప్పటి మంత్రి కారుమూరి నాగేశ్వరరావుతో కలిసి స్థానికులు అడ్డుకోవడంతో నిలిచిపోయింది. దీంతో కోర్టు కేసులు, నిరసనలు, వివాదాలతో పరిశ్రమ పూర్తిగా ప్రారంభం కాకముందే ఆగిపోయింది.

కూటమి రాకతో మళ్లీ తెరపైకి

కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో పరిశ్రమ నడపడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రాష్ట్ర స్థాయి మొదలుకొని నియోజకవర్గ స్థాయి వరకు ఆర్థిక వ్యవహారాలతో అందరినీ సర్దుబాటు చేసి ఆగమేఘాల మీద ప్రారంభించడానికి ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా అక్టోబర్‌లో పంచాయతీ నుంచి ఎన్‌ఓసీ ఇవ్వాలని పరిశ్రమ నుంచి లేఖ రావడంతో వ్యవహారం మళ్ళీ వెలుగులోకి వచ్చింది. కోర్టులో కేసు ఉన్న కారణంగా అనుమతులు ఇవ్వడం లేదని పంచాయతీ అధికారులు స్పష్టం చేశారు. ఆ తరువాత నుంచి స్థానికులు పరిశ్రమ వద్ద ఆందోళనలు నిర్వహించడం, నాలుగు లారీల గేదెలను పరిశ్రమలోకి పోకుండా పోలీసులకు అప్పగించడం, ఇతర నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నారు.

ఉద్యమాన్ని అణచివేసే కుట్ర

ఈ క్రమంలో గత నెల 25 నుంచి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నేతృత్వంలో అఖిలపక్షం ఏర్పాటు చేసి పరిశ్రమలను ప్రారంభించడానికి వీల్లేదని ఎంత దూరమైనా పోరాడతామని ప్రకటించారు. 31న చర్చల పేరుతో రిలే నిరాహారదీక్షలను పోలీసులు భగ్నం చేశారు. గోసేవా సమితి సభ్యుడు కొండ్రెడ్డి శ్రీనివాస్‌తో పాటు మరికొందరిని తహసీల్దార్ కార్యాలయంలో చర్చల పేరుతో ఎస్ఐ చంద్రశేఖర్ పిలిచి బైండోవర్ చేసి రాత్రి వరకు అక్కడే కూర్చోపెట్టారు. వెంటనే రిలే నిరాహారదీక్ష శిబిరం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందంటూ దీక్షలు భగ్నం చేశారు. అధికార పార్టీ, రెవెన్యూ, పంచాయతీ, పోలీసులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చి ఉద్యమంపై ఉక్కుపాదం మోపుతుందని, దీనివెనుక భేరసారాలు కూడా ఉన్నాయని ఉద్యమకారులు ఆరోపిస్తున్నారు. ఈ పరిణామ క్రమంలో శుక్రవారం నుంచి రిలే నిరాహారదీక్షలు తణుకు కేంద్రంగా ప్రారంభించాలని నిర్ణయించారు.

క్లుప్తంగా

త్వరలో సెట్స్ మీదకు 'రామం-రావణం'



రామం - రావణం చిత్రం పేరును ఆవిష్కరిస్తున్న బాబా శివ అఘోరీజీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి హిందువూ సంఘటితం కావాలని రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కృష్ణ కిషోర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక దొండపాడులోని బాబా శివ అఘోరీజీ పీఠంలో రామం-రావణం సినిమా పేరును శివ అఘోరీజీ ఆవిష్కరించారు. వేదాలలో నిగూఢంగా ఉన్న విజ్ఞానాన్ని వెలికితీసి సనాతన ధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పేలా అధునాతన టెక్నాలజీని ఉపయోగించి రూ.వంద కోట్ల భారీ బడ్జెట్‌తో రామం-రావణం సినిమా నిర్మిస్తున్నట్లు నిర్మాత కావూరి లావణ్య తెలిపారు. చిత్రాన్ని విజయవాడకు చెందిన ప్రముఖ దర్శకుడు దాసరి సారథి దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నామన్నారు. ఇప్పటికే కథ సిద్ధం చేసుకోగా నటీనటుల ఎంపిక కూడా 90 శాతం పూర్తయిందన్నారు. త్వరలో ఈ సినిమాను సెట్స్ మీదకు తీసుకువెళ్తున్నట్లు చిత్ర యూనిట్ పేర్కొంది.

ఆపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర డైరీని బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ ఆవిష్కరించారు. నారీ శక్తి పేరుతో గొప్ప విజయాలు సాధించిన మహిళల వివరాలు డైరీలో ఇవ్వటం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఆపస్ క్యాలెండర్‌ను సమగ్ర శిక్ష జిల్లా అధికారి పంకజ్ కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రొవ్విడి రాజకుమార్, రాష్ట్ర ఆడిట్ సభ్యులు జీ గణపతి, జిల్లా సభ్యులు పాల్గొన్నారు.

తామరాకులు కోస్తూ చెరువులో పడి మృతి

ఉండి: చెరుకువాడ గ్రామంలో మంచినీటి చెరువులో మునిగి మంగళవారం రాత్రి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన కురుమా పెద్దిరాజు(43) తామరాకులు కోసి దుకాణాలకు విక్రయిస్తుంటాడు. ఇదే క్రమంలో మంగళవారం గ్రామంలోని మంచినీటి చెరువులో టైరు సాయంతో దిగి తామరాకులు కోసేందుకు ప్రయత్నించాడు. కొంతదూరం వెళ్లిన తరువాత ట్యూబ్ తిరగబడడం, ఈత రాకపోవడంతో చెరువులో మునిగి మృతి చెందాడు. పెద్దిరాజు భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఉండి: గుర్తు తెలియని ఓ మహిళ మృతదేహం బుధవారం లభ్యమైంది. ఉండి ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపిన వివరాలివి. ఉండి పలవల రేవు వద్ద బొండాడ డ్రెయిన్‌లో మృతదేహం ఉన్నట్లు స్థానికుల సమాచారం మేరకు వీఆర్వో మేరీ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహం గుర్తించేందుకు అనుకూలంగా లేదని, మహిళ వయసు సుమారు 40 నుంచి 45 ఏళ్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతురాలు పర్పుల్, మెరూన్, గోల్డ్ కలర్ బోర్డర్ అంచు కలిగిన చీర ధరించిందన్నారు. వివరాలు తెలిసిన వారు ఉండి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

చిన్న మిల్లులకు పెద్ద కష్టం

- తగ్గిన ధాన్యం సేకరణ
- 5 టన్నులలోపు సామర్థ్యం గల మిల్లులకు తగ్గిన కేటాయింపులు
- పాత అచీవ్‌మెంట్ల ఆధారంగా సర్దుబాటు
- ఇప్పటివరకు సీఎంఆర్‌పైనే ఆధారపడి నడుస్తున్న చిన్న మిల్లులు
- ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 60 శాతం చిన్న మిల్లులే



రైస్‌మిల్లులో మర ఆడిన బియ్యం

సాక్షి, భీమవరం: చిన్న మిల్లుకు పెద్ద కష్టమొచ్చింది. ధాన్యం సేకరణ లక్ష్యం తగ్గిపోగా.. మిల్లింగ్ సామర్థ్యం మేరకు కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కేటాయింపులు చేస్తుండటం చిన్నమిల్లుల మనుగడపై ప్రభావం చూపనుంది. 5 టన్నులలోపు సామర్థ్యం గల చిన్న మిల్లులకు కొద్దిరోజులకు సరిపడా ధాన్యం మాత్రమే వస్తుండటంతో వాటిని మర ఆడిన తర్వాత మిల్లులు మూసుకోవాల్సిందేనన్న ఆందోళనలో చిన్న మిల్లర్లు ఉన్నారు. ఉదాహరణకు అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్వారపూడి సమీపంలోని చిన్న రైస్‌మిల్లుకు పాత అచీవ్‌మెంట్ ఆధారంగా గతంలో 45 నుంచి 50 ఏసీకే (ఎక్‌నాలెడ్జ్‌మెంట్)ల ధాన్యం వచ్చేది. ఇది దాదాపు మూడు నెలల పాటు మిల్లు తిరిగేందుకు సరిపోయేది. ఇప్పుడు ధాన్యం సేకరణ లక్ష్యం తగ్గడంతో సుమారు 35 ఏసీకేల వరకు రావాలి. కానీ.. సామర్థ్యం ఆధారంగా ఇవ్వడంతో కేవలం 12 ఏసీకే ధాన్యం మాత్రమే వచ్చింది. ఇది నెల రోజుల మిల్లింగ్‌కు మాత్రమే సరిపోతుంది. తర్వాత రబీ ధాన్యం వచ్చే వరకు మిల్లును మూసుకోవాల్సిందే. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఒక రైస్‌మిల్లుకు గత ర్యాండమైజ్ పద్ధతిలో 40 ఏసీకే (ఒక ఏసీకే దాదాపు 290 క్వింటాళ్లకు సమానం)లకు పైగా ధాన్యం వచ్చేది. ఈసారి ప్రైవేట్ వ్యాపారం చేసే మిల్లులకు సీఎంఆర్ ఇవ్వడం, ప్రస్తుత ధాన్యం సేకరణలో దళారుల జోక్యానికి అవకాశం కలగడంతో తమకు నచ్చిన మిల్లులకు వారు ధాన్యాన్ని చేరవేస్తున్నారు. ఈ జిల్లాలో 10 ఏసీకేల ధాన్యం సేకరణ కష్టంగా మారి మిల్లు ఎంతకాలం నడుస్తుందో చెప్పలేని పరిస్థితి.

ఉమ్మడి గోదావరి జిల్లాల్లో 780 వరకు రైస్ మిల్లులు

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో రైస్ మిల్లింగ్ పరిశ్రమ విస్తరించి ఉంది. ఈ రెండు జిల్లాల్లో 780 వరకు రైస్‌మిల్లులు ఉండగా.. పశ్చిమ గోదావరి జిల్లాలో తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, ఆకివీడు తదితర చోట్ల 360 వరకు రైస్ మిల్లులు ఉన్నాయి. రెండు జిల్లాల్లో గంటకు 5 టన్నుల నుంచి 10 టన్నులకు పైగా మిల్లింగ్ సామర్థ్యం కలిగిన పెద్ద మిల్లులు 40 శాతం ఉండగా, మిగిలినవన్నీ 5 టన్నులలోపు సామర్థ్యం గల చిన్న మిల్లులే. సాధారణంగా పెద్ద మిల్లులు ప్రైవేట్ మార్కెట్‌కి, ఎగుమతులకు ప్రాధాన్యమిస్తే.. చిన్న మిల్లులు ఎక్కువగా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)పై ఆధారపడతాయి. రైతుల నుంచి సివిల్ సప్లయిస్ శాఖ సేకరించిన ధాన్యాన్ని సీఎంఆర్ కోసం మిల్లులకు అప్పగిస్తుంది. క్వింటాల్ ధాన్యానికి 67 కేజీల బియ్యాన్ని తిరిగి అప్పగించాలి. అందుకోసం కమీషన్ రూపంలో వారికి వచ్చేది కేవలం రూ.10 మాత్రమే. మిల్లింగ్ చేసేటప్పుడు వచ్చే తవుడు, నూకలు, చిట్టు తదితర ఉప ఉత్పత్తులకు రైస్ బ్రాన్ ఆయిల్, ఆల్కహాల్, ఇథనాల్ తయారీలో డిమాండ్ ఉండటంతో సీఎంఆర్ చేస్తుంటాయి.

గతంలో పాత అచీవ్‌మెంట్ల ఆధారంగా..

తూర్పుగోదావరిలో మిల్లింగ్ కెపాసిటీ ఎక్కువగా ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం కొనుగోలు చేసి ఎక్స్‌పోర్ట్, ప్రైవేట్ మార్కెట్ చేస్తుంటారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని మిల్లులు ప్రైవేట్ వ్యాపారం తక్కువగా చేస్తుంటాయి. సీఎంఆర్ చేయడంలో ఈ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. ప్రైవేట్ వ్యాపారం చేసే, డ్రయర్లు, లేటెస్ట్ టెక్నాలజీ లేని మిల్లులకు సీఎంఆర్ కేటాయింపులు చేయకూడదన్న నిబంధనలు ఉన్నప్పటికీ వాటి మనుగడ దృష్ట్యా గతంలో కొన్ని సడలింపులు ఇచ్చేవారు. సీజన్‌లో ధాన్యం సేకరణ లక్ష్యాన్ని బట్టి పాత అచీవ్‌మెంట్ల మేరకు సీఎంఆర్ కేటాయింపులు జరిగేవి. దీనివల్ల సక్రమంగా సీఎంఆర్ చేసే చిన్న మిల్లులకు కేటాయింపులకు ఇబ్బంది ఉండేది కాదు.

మిల్లులు నెల రోజులు తిరిగితే గొప్ప

ఏటా సీజన్‌లో చిన్న మిల్లులకు 40 నుంచి 50 ఏసీకేల వరకు ధాన్యం సేకరణ జరిగితే ఇప్పుడు అధిక శాతం 10 నుంచి 15 ఏసీకేలలోపే ఉన్నాయి. దీంతో వాటి సామర్థ్యం మేరకు నెల నుంచి నెలన్నర రోజులు మాత్రమే మర ఆడేందుకు వస్తాయని, తర్వాత రబీ ధాన్యం మార్కెట్‌లోకి వచ్చే వరకు మిల్లులు మూసేయాల్సిందేనని చిన్న మిల్లర్లు అంటున్నారు. మిల్లు తిరిగినా తిరగకపోయినా వాటి చిన్న, పెద్ద మిల్లుల కెపాసిటీని బట్టి సిబ్బంది జీత భత్యాలు, విద్యుత్ బిల్లులు, అద్దెలు, నిర్వహణ రూపంలో నెలకు రూ.2.50 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చవుతుంది. ఈ మేరకు నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. ఒక్కో చిన్నమిల్లులో గుమాస్తా, డ్రైవర్, జట్టు కార్మికులు 10 నుంచి 12 మంది వరకు పనిచేస్తుంటారు. మిల్లు మూతపడితే వారంతా ఉపాధి కోల్పోవాల్సి వస్తుంది.

సేకరణ లక్ష్యాన్ని తగ్గించడంతో చిన్న మిల్లులకు చిక్కులు

గత ఖరీఫ్‌తో పోలిస్తే ఈ సీజన్‌లో ధాన్యం సేకరణ లక్ష్యాన్ని తగ్గించేశారు. దీనికితోడు మిల్లింగ్ కెపాసిటీ మేరకు సీఎంఆర్ కేటాయింపులు చేయడం చిన్న మిల్లులకు చిక్కులు తెచ్చిపెట్టింది. ప్రైవేట్ వ్యాపారం చేసే మిల్లులకు సీఎంఆర్‌కు అవకాశం ఇవ్వడంతో చిన్న మిల్లులకు కేటాయింపులు గణనీయంగా తగ్గాయి. ప్రస్తుతం ధాన్యం సేకరణలో దళారుల జోక్యం మరింత సమస్యగా తయారైంది. గత ప్రభుత్వం ధాన్యం సేకరణలో ఏ దశలోనూ దళారుల జోక్యానికి ఆస్కారం లేకుండా రైతుకు పూర్తి మద్దతు ధర అందేలా కట్టుదిట్టం చేసింది. రైతు ఆర్‌బీకే/సొసైటీకి ధాన్యం శాంపిల్ తీసుకువెళితే.. మిగిలిన పనంతా అక్కడి సిబ్బంది చూసుకునేవారు. ధాన్యం ఆన్‌లైన్ చేయగానే ఏ మిల్లుకు వెళ్లాలో కంప్యూటర్ సూచించేది. నూతన విధానంలో అడుగడుగునా దళారుల జోక్యం పెచ్చుమీరింది. కమీషన్ ఏజెంట్లు తమకు నచ్చిన పెద్ద మిల్లర్లతో మాట్లాడుకుని ధాన్యాన్ని అక్కడికే తరలిస్తున్నారు. దీంతో చిన్న మిల్లులకు ధాన్యం సేకరణ కష్టంగా తయారైంది.

సుమారుగా లెవీ సేకరణ లక్ష్యం ఇలా..

జిల్లా	గత ఏడాది	ఈ ఏడాది
	(మెట్రిక్ టన్నుల్లో)	
పశ్చిమ గోదావరి	4.56 లక్షలు	4.10 లక్షలు
అంబేడ్కర్ కోనసీమ	3.81 లక్షలు	2.37 లక్షలు
ఏలూరు	4.10 లక్షలు	3.50 లక్షలు
తూర్పు గోదావరి	3.70 లక్షలు	3.10 లక్షలు
కాకినాడ	3.60 లక్షలు	3 లక్షలు

రైతుల పక్షాన పోరాటం చేస్తాం

వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం



తాడేపల్లిగూడెం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం విమర్శించారు. బుధవారం ఆయన నివాసం వద్ద విలేకర్లతో మాట్లాడారు. రైతులకు పంటల బీమా ప్రీమియంను కూటమి ప్రభుత్వం ఎత్తివేయడం దారుణం అన్నారు. విజయవాడ ప్రాంతంలో బుడమేరు, తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాలలో ఎర్ర కాలువ ముంపు సంభవించినప్పుడు ఇన్సూరెన్స్ కంపెనీలతో మాట్లాడి రైతులను ఆదుకునేందుకు కొత్త పథకాలు తీసుకురానున్నట్లు గతంలో విజయవాడలో చంద్రబాబు హడావిడి చేశారన్నారు. రైతులకు కేంద్రం ఇచ్చే రూ.6,500తో పాటు కూటమి ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసా రూ.20 వేలతో కలుపుకుని మొత్తం రూ.26,500 సంక్రాంతి నాటికి రైతులకు చెల్లించాలని రఘురాం డిమాండ్ చేశారు. గూడెం ప్రాంతంలో ఎర్రకాలువ ముంపు సంభవించినప్పుడు రెండో పంటగా రైతులు మినుము, మొక్కజొన్న పంటలు వేసుకున్నారని అది కూడా ఎర్ర కాలువకు రెండో సారి వరద రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఆక్వారైతులకు రాయితీపై యూనిట్ రూ.1.50కు ఇవ్వకపోయినా, సంక్రాంతి నాటికి రైతు భరోసా అమలు చేయకపోయినా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి, రాష్ట్ర స్థాయిలో రైతులతో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు.

సమయం వృథా చేస్తే తిరిగి రాదు



ఉండి బీసీ వెల్ఫేర్ కళాశాల వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): సమయం వృథా చేస్తే తిరిగి రాదని.. విద్యార్థులు బాగా చదివి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన ఉండి బీసీ వెల్ఫేర్ కళాశాల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌ను, వంట పాత్రల శుభ్రతను స్వయంగా పరిశీలించారు. వంట శాలలోనికి బల్లులు, తదితర క్రిమికీటకాలు రాకుండా కిటికీ మెస్ వేయించాలని వసతి గృహాధికారికి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అనవసరమైన వ్యాపకాలను పక్కనపెట్టి చదువుపై ఏకాగ్రతతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఉజ్వల భవిష్యత్తుకు చదువు ఒక్కటే మార్గం అన్నారు. మీరు ఉన్నత స్థితిలో ఉంటేనే మీ తల్లిదండ్రులను, పిల్లలను ఉన్నతంగా ఆదరించేందుకు దోహదపడుతుందని ఉద్బోధించారు. నూతన సంవత్సరం సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి విద్యార్థులకు నోటు పుస్తకాలు, కేకులు, ఫ్రూట్స్ సొంత ఖర్చుతో అందజేశారు. అలాగే రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రగ్గులను జేసీ చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జీవీఆర్‌కేఎస్ఎస్ గణపతిరావు, వసతి గృహ సంక్షేమ అధికారి సూర్యచంద్ర, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భీమవరం శాఖ చైర్మన్ ఎంఎస్‌వీఎస్ బద్రిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడికి మంచు దెబ్బ



మెట్ట ప్రాంతంలో పూతమీద ఉన్న మామిడి తోట



మంచు ప్రభావంతో రాలిపోతున్న మామిడి పూత

పాడి - పంట

చింతలపూడి : రాష్ట్రంలో మామిడి తోటల విస్తీర్ణంలో కృష్ణా జిల్లా తరువాత చింతలపూడి ప్రాంతం ద్వితీయ స్థానంలో నిలుస్తుంది. ఈ సంవత్సరం వాతావరణ పరిస్థితుల రీత్యా మామిడితోటల్లో కొన్ని చోట్ల ఇంకా పూత రాలేదు. కానీ ప్రస్తుతం మెట్ట ప్రాంతంలోని మామిడి తోటల్లో పూత ప్రారంభం అయ్యింది. అయితే గత రెండు వారాలుగా మంచు కురుస్తుండటంతో మామిడి తోటలు మంచు దెబ్బకు విలవిల్లాడుతున్నాయి. సంవత్సరం అంతా సస్యరక్షణ చేపట్టి పంటను కాపాడుకుంటూ వస్తుంటే మంచు కారణంగా పూత, పిందె మాడిపోయే పరిస్థితి వస్తుందేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా 25-30 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత, పొడి వాతావరణం మామిడి తోటలకు అనుకూలం. ఈ దశలో పూత ఎక్కువగా రావడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం మంచు దెబ్బ కారణంగా పూత రాలిపోవడం, వచ్చిన పూతను కాపాడుకోవడానికి రైతులు సరైన సస్యరక్షణ చేపట్టాలని ఉద్యానాధికారిణి ఎండీ షాఫియ ఫర్‌హీన్ సూచిస్తున్నారు. 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా 50 గ్రాముల యూరియా ఒక లీటరు నీటిలో కలిపి చెట్లకు స్ప్రే చేస్తే ఫలితం ఉంటుందన్నారు.

తేనే మంచు పురుగు నివారణ ఇలా...

ప్రస్తుతం మామిడి పూతపై తేనె మంచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంది. లేత పూ మొగ్గలు ప్రారంభంలో తేనె మంచు పురుగు ఆశిస్తుంది. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్(కాన్ఫిడార్) ద్రావణం 10 లీటర్ల నీటికి 3 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలి. లేదా థయో మిటాక్జిమ్ 10 లీటర్ల నీటికి 3 గ్రాములు కలిపి పిచికారీ చేసినట్లయితే పురుగు ఉధృతి తగ్గుతుంది.

తామర పురుగులు

ఇవి కొత్త చిగురు, పుష్ప గుచ్చాలు, పిందెలపైన అసంఖ్యాకంగా చేరి గోకి రసం పీలుస్తాయి. వీటి నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఫిప్రోనిల్ 2 మిల్లీ లీటర్లు, లేదా 03 మిల్లీ లీటర్ల ఇమిడాక్లోప్రిడ్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

బూడిద తెగులు

చల్లని రాత్రులు, పగటి వాతావరణంలో పూత, పిందెలపై తెల్లని పొడిలాంటి బూజు ఏర్పడుతుంది. ఈ శిలీంధ్రం ఆశించడం వల్ల పూత, పిందెలు రాలిపోతాయి. వీటి నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా ట్రిడీమార్ఫ్ 1 మిల్లీ లీటర్ లేదా డైనోకాప్ 1 మిల్లీ లీటర్, లేదా హెక్సకోనజోల్ 2 మిల్లీ లీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయడం వల్ల బూడిద తెగులును నివారించవచ్చు.



ఎండీ షాఫియ ఫర్‌హీన్
ఉద్యానాధికారిణి, చింతలపూడి

అడుగడుగునా శ్రీవారికి నీరాజనాలు



గ్రామోత్సవం అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామి, అమ్మవార్లను దర్శిస్తున్న భక్తులు



శ్రీవారి ఆలయ తూర్పు ప్రాంతంలో గజలక్ష్మి సందడి



దర్శనం క్యూలైన్లలో కిక్కిరిసిన భక్తులు

ద్వారకాతిరుమల: నూతన సంవత్సరం తొలిరోజున తమ ఇంటి ముంగిటకు వచ్చిన శ్రీవారికి భక్తులు పూజాదికాలు జరిపి, నీరాజనాలు సమర్పించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ద్వారకాతిరుమల దివ్య క్షేత్రంలో బుధవారం నిర్వహించిన శ్రీవారి గ్రామోత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, గజ, అశ్వ సేవల నడుమ స్వామివారికి వైభవోపేతంగా గ్రామోత్సవం నిర్వహించారు. తిరువీధుల్లో స్వామివారికి భక్తులు అడుగడుగునా నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రధాన కూడలిలోని ధనుర్మాస మండపంలో శ్రీవారు, అమ్మవార్లు, గోదాదేవికి అర్చకులు విశేష పూజలు జరిపి, భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించారు. ఆలయ తూర్పు ప్రాంతంలో గజలక్ష్మి సందడి చేసింది.

శ్రీవారి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల : నూతన సంవత్సరం తొలిరోజును పురస్కరించుకుని చినవెంకన్న దివ్య క్షేత్రం బుధవారం భక్తులతో పోటెత్తింది. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభం కావడంతో క్షేత్ర పరిసరాల్లో సందడి నెలకొంది. కొత్త సంవత్సరం అంతా శుభప్రదంగా ఉండాలన్న ఉద్దేశంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో పాటు, పినకడిమి నుంచి పాదయాత్రగా మంగళవారం రాత్రి క్షేత్రానికి చేరుకున్న వేలాది మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించారు. దాంతో దర్శనం క్యూలైన్లు, ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, అన్నదాన విభాగం భక్తులతో కిటకిటలాడాయి. పార్కింగ్ ప్రాంతాలు భక్తుల వాహనాలతో పూర్తిగా నిండిపోయాయి. వేలాది మంది భక్తులు స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

బాలసదన్‌లో కలెక్టర్ సందడి



బాలలతో చెస్ ఆడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

దెందులూరు : దెందులూరు బాలసదన్‌లో బుధవారం కలెక్టర్ వెట్రిసెల్వి సందడి చేశారు. పిల్లలతో కలిసి చెస్ ఆడారు. పిల్లలు ప్రదర్శించిన ఆటపాటలను తిలకించారు. చదువుల్లో వారు సాధిస్తున్న ప్రగతి, ఆరోగ్య భద్రత, వారికి అందిస్తున్న ఆహార మెనూ వివరాలు, ఇతర సౌకర్యాలను అన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి బాలసదన్ సూపరింటెండెంట్‌కు తగు సూచనలు చేశారు. తనకు ఏమాత్రం విరామం దొరికినా చిన్నారులతో గడిపి ఆనందం పొందుతానని కలెక్టర్ తెలిపారు. బాగా చదివి మంచి మార్కులు సాధించి ఉన్నత స్థానాలకు ఎదగాలని పిల్లలకు ఆమె ప్రబోధించారు. తొలుత కలెక్టర్ కె.వెట్రిసెల్వికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయటానికి వచ్చిన ప్రముఖులందరూ అందజేసిన నోట్‌బుక్స్, పెన్సిళ్లు, స్కేళ్లు, కలర్ పెన్సిళ్లు, పెన్నులు బాలసదన్‌లోని పిల్లలకు అందించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు దెందులూరు తహసీల్దార్ బి.సుమతి, జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి పి.శారద, జిల్లా బాలల సంరక్షణ అధికారి సీహెచ్ సూర్యచక్రవేణి, బాలసదన్ సూపరింటెండెంట్ ఎస్. బేబీ సరోజిని, బాలసదరన్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

భీమవరం: పట్టణంలోని దుర్గాపురం వద్ద ఎదురెదురుగా రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. భీమవరం టూటౌన్ ఎస్సై రెహమాన్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని లంకపేటకు చెందిన మంత్రిపూడి మహేష్ (19) అతని స్నేహితుడు కె సాగర్ మోటార్‌సైకిల్‌పై విష్ణు కళాశాల వైపు నుంచి వస్తుండగా దుర్గాపురానికి చెందిన లక్కోజు గౌతమ్ ఎదురుగా మోటారుసైకిల్‌పై వస్తూ ఢీకొనడంతో మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో గౌతమ్‌కు తీవ్రగాయాలు కాగా గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా, స్వల్ప గాయాలైన సాగర్ భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రెహమాన్ చెప్పారు.

తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు వేలం

ముసునూరు: మహా శివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు బలివేలోని బలేరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో జరుగనున్న మహోత్సవాల్లో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి ఈనెల 11న శనివారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన విలేకర్లకు వివరాలను వెల్లడించారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో 3 రోజుల పాటు ఇక్కడ ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతాయని, ఉత్సవ ప్రాంగణంలో వ్యాపారాలు నిర్వహించుకునుటకు అవసరమైన తాత్కాలిక దుకాణ సముదాయాల ఏర్పాటు, నాలుగు రోజుల పాటు కొబ్బరి చిప్పల సేకరణకు ఈ వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనుటకు ఆసక్తిగలవారు దుకాణ స్థలాల కోసం రూ.50 వేలు, కొబ్బరి చిప్పల సేకరణదారులు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించి, సకాలంలో వేలంకు హాజరు కావాలని కోరారు.

3న జాబ్‌మేళా

జంగారెడ్డిగూడెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్‌పీసీ ట్రైనింగ్ సెంటర్ (స్కిల్ హబ్) నందు ఈ నెల 3వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.జితేంద్ర బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ ఫెయిర్ నందు అపోలో ఫార్మసీ, ఎస్ఎస్ ఇనుస్ట్రుమెంట్స్, కొల్గెట్ పామోలివ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 150 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ జాబ్‌మేళాకు పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18-30 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులని తెలిపారు. వివరాలకు 96425 98324, 96525 03799ను (9988853335 - టోల్ ఫ్రీ) సంప్రదించవచ్చన్నారు.

రేపటి నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

నరసాపురం: భీమవరంలో ఈనెల 3, 4, 5 తేదీల్లో సీపీఎం 26వ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరామ్ తెలిపారు. బుధవారం స్థానిక మీరా గ్రంథాలయ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల నరసాపురంలో జరిగిన పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాలు పూర్తి విజయవంతమయ్యాయన్నారు. అలాగే ఫిబ్రవరిలో నెల్లూరులో జరిగే రాష్ట్ర మహాసభలు, ఏప్రిల్‌లో మధురైలో జరిగే ఆలిండియా మహాసభలకు సన్నాహకంగా జిల్లా మహాసభలు జరుగుతున్నాయని చెప్పారు. జిల్లా అభివృద్ధిపై చేయాల్సిన పోరాట క్రమాన్ని, ప్రణాళికను రూపొందిస్తామన్నారు. అలాగే ఈ ప్రాంతానికి చెందిన విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు పేరును చించినాడ వారధికి, నరసాపురం-విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్ రైలుకు పెట్టాలని డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు పాల్గొన్నారు.

సామాన్యుడికి షాక్

- విద్యుత్ బిల్లుల భారం మోపిన కూటమి సర్కారు
- ఆందోళనలో గృహ వినియోగదారులు
- సూపర్‌సిక్స్ హామీలను గాలికొదిలేసిన పాలకులు



విద్యుత్ మీటర్లు



విద్యుత్ సబ్ స్టేషన్

పెంటపాడు: కూటమి ప్రభుత్వం సామాన్యులకు షాక్ ఇస్తోంది. సూపర్‌సిక్స్ హామీల సంగతి అటుంచితే ప్రస్తుతమున్న విద్యుత్ చార్జీలను భారీగా పెంచేసి పేదల నడ్డి విరుస్తోంది. సర్దుబాటు చార్జీలు, ట్రూ ఆఫ్ చార్జీలు అంటూ బిల్లులు భారీగా పెంచేస్తోంది. దీంతో సమాన్య గృహ వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఏరు దాటాక తెప్ప తగలేసిన తీరులో కూటమి ప్రభుత్వ పాలన ఉందని పలువురు వ్యాఖ్యనిస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను పెడచెవిన పెడుతున్నారని ప్రజలు అంటున్నారు. దీనికి తోడు బాదుడే బాదుడు అన్నట్లుగా ప్రజలపై విద్యుత్ చార్జీల పెంపు ఉందని వాపోతున్నారు. ఇందన చార్జీల పేరుతో యూనిట్ కు రూ.0.97పైలు బారం వెసింది. పిక్స్, చార్జీలు, కస్టమర్స్ చార్జీలు, ఈడీ, సర్‌చార్జీ, ఎఫ్‌పీపీఎ, ఎఫ్‌పీపీఏ2 తదితర చార్జీల బారాన్ని మోస్తున్న వినియోగదారులపై కొత్తగా(ఇందన చార్జీ) అదనపు సొమ్ము వసూలు చేస్తుంది. సామాన్యుడి దగ్గర నుంచి పారిశ్రామిక వేత్తల దాకా అదనపు చార్జీల బరాన్ని మోయాల్సి వస్తోంది. ప్రధానంగా గృహవసర వినియోగదారులు మరింత ఇబ్బందులకు గురౌతున్నాడు. ప్రస్తుత బిల్లు ప్రకారం యూనిట్‌కు రూ.10ల వరకు చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. 50యూనిట్లు వినియోగించిన గృహ అవసరాల వ్యక్తి రూ.500లు పైబడి చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇప్పుడు ఇందన చార్జీల పేరుతో బిల్లు వసూలు చేస్తున్నారని రానున్న రోజుల్లో మరో పేరుతో అదనపు చార్జీలు వసూలు చేస్తారని ఆందోళన వినియోగదారుల్లో వ్యక్తమవుతుంది. వాతావరణ పరిస్థితులతో రేకుల షెడ్డు నుంచి విలాస వంతమైన భవనాలు వరకు ఏసీలు వినియోగంతో మరింత బారం పెరిగింది.

నెరవేరని హామీలు

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తయినా ఇంతవరకు సూపర్ సిక్స్ హామీల అమలు ఊసే లేదు. ఉచిత గ్యాస్ డబ్బులు ఇప్పటికీ చాలా మంది ఖాతాల్లో జమ కావడం లేదు. ఇదేంటని ప్రశ్నిస్తే సాంకేతిక కారణాలు అంటూ తప్పించుకుంటున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, 50ఏళ్లకు సామాజిక పింఛన్లు, ఉద్యోగ నియామకాలు..ఇలా ఏ ఒక్క హామీ కూడా కూడా కార్యారూపం దాల్చక పోవడంతో అన్ని వర్గాల ప్రజల కూటమి ప్రభుత్వంపై తీవ్ర అసహనంతో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యుత్ చార్జీల భారం మోపడంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సామాన్య ప్రజలతో పాటు అన్ని ప్రజా సంఘాలు విద్యుత్ సర్దుబాటు చార్జీలను వ్యతిరేకిస్తున్నాయి.

ప్రజలు క్షమించరు

కూటమి ప్రభుత్వం హామీలు నిలబెట్టుకోకుండా విద్యుత్ చార్జీలు పెంచడం తగదు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ఇప్పుడు అమలు చేయకపోతే ప్రజలు క్షమించరు.

– జామి కృష్ణ, పెంటపాడు, ఆక్వారైతు

హామీల సంగతేంటి?

సూపర్‌సిక్స్ హామీల అమలుపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన లేదు. హామీలు ఇచ్చేటప్పుడు సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. అధికారంలోకి వచ్చాక విస్మరించడం తగదు.

– కె.రాణి, గృహిణి, తాడేపల్లిగూడెం

చంద్రబాబు ప్రజల్ని మోసం చేశాడు

ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా చంద్రబాబు ప్రజలను మోసం చేశాడు. సామాన్యులకు పెనుభారంగా కార్మికులు, రైతులు, ప్రజలకు మోయలేని భారంగా ఉంది. కష్టపడ్డ రైతులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.

– రమేష్‌బాబు,కూలీ, తాడేపల్లిగూడెం

క్లుప్తంగా

ఘనంగా పుంతలో ముసలమ్మ ఆలయ వార్షికోత్సవాలు



పుంతలో ముసలమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్న రాజా త్రినాథ్, ఈతకోట తాతాజీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): టూ టౌన్‌లోని సీతారాంపేట, కొబ్బరితోటలో పుంతలో ముసలమ్మ అమ్మవారి వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. యువఫ్రైండ్స్ సర్కిల్ అధ్యక్షుడు రాజా త్రినాథ్ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. లలితా సహస్ర పారాయణం జరిగింది. అమ్మవారిని బీజేపీ నాయకులు ఈతకోట తాతాజీ సందర్శించి, పూజలు జరిపారు. సత్కారాలు జరిగాయి. ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పేరిచర్ల ఫౌండేషన్ సేవలు అభినందనీయం



మహిళలకు రగ్గులు, చీరలు, బెడ్‌షీట్స్ అందజేస్తున్న పేరిచర్ల ఫౌండేషన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో పేరిచర్ల ఫౌండేషన్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పేరిచర్ల ఫౌండేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం మహిళలకు బెడ్‌షీట్స్, చీరలు, రగ్గులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు పేరిచర్ల మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు సేవలను మరింతగా విస్తృతం చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అలంపురానికి ప్రత్యేక వైద్యులు రాక

పెంటపాడు: అలంపురం వెంకటరమణ చారిటీ ఆసుపత్రికి ఈనెల 2న ప్రత్యేక వైద్యులు రానున్నట్లు ట్రస్టు ప్రతినిధి కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రికి చెందిన ఎముకలు, కీళ్లు, జనరల్ సర్జన్, చర్మవైద్యులు, ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణులు, చెవి, ముక్కు గొంతు వైద్యనిపుణులు ప్రత్యేక పరీక్షలు చేస్తారన్నారు. దీంతో పాటు ప్రతి శుక్రవారం అనారోగ్యసమస్యలు ఉన్నవారు రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి ఉచిత బస్సు ఏర్పాటు చేసామన్నారు. అక్కడ డాక్టర్‌కు వైద్య పరీక్షలు చేసి ఆరోగ్యశ్రీలో రాని టెస్టులకు రాయితీ కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీవీకేలో సంక్రాంతి సంబరాలు



గొబ్బిళ్లు కార్యక్రమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): సంక్రాంతి సందర్భంగా ముందస్తు గొబ్బిళ్ల కార్యక్రమాన్ని బుధవారం బీవీకే ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా గౌరీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. గొబ్బిళ్ల చుట్టు చిన్నారులు తిరుగుతూ పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

హైందవ శంఖారావ సభకు మద్దతుగా బైక్ ర్యాలీ

పెనుమంట్ర: హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావ సభకు మద్దతుగా మండల విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం బైక్ ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మండలంలోని సోమరాజు ఇల్లిందలపర్రు నుంచి ఉదయం ప్రారంభించి జుత్తిగ, మాముడూరు, పెనుమంట్ర, వెలగలవారి పాలెం, ఆలమూరు, నెలమూరు, సచివరం, వెలగలేరు గ్రామాల మీదుగా ప్రచారం చేస్తూ మార్టేరు గ్రామానికి చేరుకుంది. ఈ ప్రచార ర్యాలీలో వివిధ పార్టీలకు చెందిన యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యువత క్రీడల్లో ప్రతిభను చాటాలి

పోడూరు: యువత క్రీడల్లో ప్రతిభను పెంపొందించుకుని రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని డీసీసీబీ మాజీ డైరెక్టర్ దేవళ్ల ప్రసాద్ దేవళ్ల ప్రసాద్ పిలుపునిచ్చారు. జాతీయ వాలీబాల్ జట్టు(సీనియర్స్)కు ఎంపికైన సందర్భంగా జిన్నూరు గ్రామానికి చెందిన వాలీబాల్ క్రీడాకారుడు గుబ్బల శ్రీనివాస్(చోటు) ను స్థానిక నాయకులు బుధవారం సత్కరించారు. దేవళ్ల ప్రసాద్, మాజీ సర్పంచ్ పాలవలస తులసీరావు దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం గ్రామానికి ఎంతో గర్వకారణమని వారు కొనియాడారు.

చదువు లేక వెనుకబడిన ఎస్టీలు



మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో ఎస్టీ గిరిజన కుటుంబాల ఆత్మీయ సమావేశం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఎస్టీలకు ప్రత్యేక రాయితీలు ఇస్తున్నా చదువు లేక కుటుంబాలన్నీ వెనుకబడి ఉంటున్నాయని ఏపీ ఎస్టీ గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సింగం సుబ్బారావు అన్నారు. బుధవారం మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో ఎస్టీ గిరిజన కుటుంబాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగం సుబ్బారావు మాట్లాడుతూ ఒకటిరెండు కుటుంబాలు తప్ప మిగిలిన వారు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం కడియద్ద, మెట్ట ఉప్పరగూడెం, దండగర్ర, జగన్నాథపురం, మాధవరం, అప్పారావుపేట గ్రామాల్లో ఎస్టీ కుటుంబాలకు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఎస్టీ సంఘ మెట్ట ఉప్పరగూడెం, మాధవరం, జగన్నాథపురం, కడియద్ద గ్రామ అధ్యక్షుడు చనమర్తి దుర్గారావు, చనమర్తి శ్రీను, యరసాని శ్రీను, దుర్గారావు, పెద్దిరాజు పండు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి



జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న దృశ్యం

అత్తిలి: విద్యార్థులు రెగ్యులర్ పాఠ్యాంశాలతో పాటు స్టడీ మెటీరియల్‌ను చదివి పదో తరగతి పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని మండల విద్యాశాఖాధికారి ఎన్. రమేష్ అన్నారు. బుధవారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేసి ఇటీవల పదవీవిరమణ చేసిన డీఎంజీ ప్రసాద్ రూ. 5 వేలతో కొనుగోలు చేసిన స్టడీ మెటీరియల్‌ను ఆపాఠశాల పదో తరగతి విద్యారుమ్థలకు పంపిణీ చేసారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో రమేష్ మాట్లాడుతూ ఈ స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ సబ్జెక్టులలో ఎక్కడైనా ఏదైనా సందేహాలు ఉంటే సంబంధిత ఉపాధ్యాయుల సహకారంతో వాటిని నివృత్తి చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో -2 ఎంవీఎల్‌కే ప్రసాద్, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఎస్ పురుషోత్తం, ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు ఎ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సీహెచ్‌జెఎస్ఎన్ ప్రసాద్, రాష్ట్ర నాయకులు ఎంవీ సుబ్బరాజు, ఎన్‌వీ సత్యనారాయణ, యూఎన్‌వీ శివయ్య, కె నారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ పి శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, శ్రీనివాసరావు, ఆత్మలింగం, రమాప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా 28వ వార్షికోత్సవం



తణుకు బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో కేకు కట్‌చేస్తున్న మేనేజరు వినోద్‌కుమార్

తణుకు అర్బన్: తణుకు బ్యాంక్ ఆఫ్ ఇండియా 28వ వార్షికోత్స వేడుకలు బుధవారం బ్యాంక్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ సీనియర్ బ్రాంచ్ మేనేజరు జి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ 1995లో తణుకులో ప్రారంభించబడిన బ్యాంక్ ఆఫ్ ఇండియా తణుకు బ్రాంచ్ అనతి కాలంలోనే ఖాతాదారులు మన్ననలు పొందిందని అన్నారు. ముఖ్యంగా వ్యాపారానికే ప్రాధాన్యత కాకుండా రైతాంగానికి, ఖాతాదారులు అవసరమైన రుణాలు ఇవ్వడంలో బ్రాంచ్ ఎల్లప్పుడూ ముందువరసలో ఉంటుందన్నారు. బ్రాంచ్‌కు వచ్చిన ఖాతాదారులకు సత్వర సేవలందించడానికి ప్రాధాన్యతనిస్తామని, ఖాతాదారులకు అవసరమైన సమయంలో బంగారంపై రుణాలు అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం బ్యాంకు ఆవరణలో కేకు కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలు విజయవంతం చేయాలి



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ప్రతాప్

తణుకు అర్బన్: ఈ నెల 3న భీమవరంలో నిర్వహించనున్న సీపీఎం 26వ జిల్లా మహాసభలకు ప్రజలు పెద్దఎత్తున తరలి రావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక అమర వీరుల భవనంలో బుధవారం నిర్వహించిన సీపీఎం సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడా రు. సీపీఎం పార్టీ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి గ్రామ, వార్డు స్థాయి నుంచి ఆల్ ఇండియా వరకు మహాసభలు నిర్వహిస్తుందని, గడిచిన కాలంలో ప్రజా సమస్యలపై చేసిన పోరాటాల ఫలితాలపై సమీక్షలు చేయడం జరుగుతుందన్నారు. నేడు అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర కూటమి ప్రభుత్వాలు అప్పుడే మళ్లీ కొత్తదారిలో ప్రజలపై భారాలు వేయడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జనవరి 3, 4, 5 తేదీల్లో జరిగే మహా సభలకు రాష్ట్ర నాయకులు హాజరవుతారని, ఈ మహా సభల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్ పోరాటాల రూపకల్పన చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. భీమవరం బస్టాండ్ నుంచి ప్రకాశం చౌక్ వరకు ర్యాలీ అనంతరం సభ మధ్యాహ్నం 3గంటలకు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయ కుమారి, గుబ్బల గోపి, కె. నాగరత్నం, వెంకటేశ్వరరావు, యన్‌వీ బాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలన అంతా అవినీతిమయం

మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ



మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్ : నూతన సంవత్సరం 2025 ప్రారంభం సందర్భంగా మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం కొట్టును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నమ్మి ఓటేసిన ప్రజలు ఇప్పుడు భంగపడ్డారన్నారు. కూటమి సూపర్‌సిక్స్ హామీలలో ఒక్కటీ అమలు చేయకపోవడంతో చంద్రబాబునాయుడు మళ్లీ మోసం చేశాడని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. ఏడు నెలల పరిపాలనను ప్రజలు గమనించి చంద్రబాబునాయుడు పాలనను ఎండగట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రోజుకో డైవర్షన్ పాలిటిక్స్‌తో పబ్బం గడుపు తున్నాడని కొట్టు వాఖ్యానించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అధికారంలోకి వచ్చిన అనంతరం చేసే పనులకు పొంతన లేదన్నారు. ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితమని చెప్పి ఇటీవల ఒక్క సిలిండరు ఇచ్చి, ఇచ్చిన వారికి సొమ్ములు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు ఇవ్వకపోవడం చంద్రబాబునాయుడు అసమర్థతను తెలియజేస్తుందన్నారు. మూడు సిలిండర్లు హామీ ఇచ్చి బడ్జెట్‌లో ఒక్క సిలిండరుకు మాత్రమే కేటాయించారని ఆరోపించారు. తల్లికి వందనం, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 స్త్రీ శక్తి పథకం ద్వారా ఇస్తామని, నిరుద్యోగులకు రూ.3వేలు పింఛన్ హామీలను గాలికి వదిలేశారన్నారు. విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచి ప్రజల నెత్తిన ఆర్థిక భారాన్ని మోపిన చంద్రబాబునాయుడును ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారన్నారు. సూపర్‌సిక్స్ అద్భుతంగా ఉందంటూ మైకుల్లో ఊదరగొడుతున్న చంద్రబాబునాయుడు వాటిని అమలుచేసి ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తే సంతోషంగా ఉంటారన్నారు.

దర్శిపర్రులో ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో పుంతలో ముసలమ్మ అమ్మవారు

పెంటపాడు: దర్శిపర్రు గ్రామ దేవత పుంతలో ముసలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు పురస్కరించుకొని బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసారు. ఈ సందర్భంగా అమ్మవారిని పలువురు భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసారు. రాత్రి అమ్మవారికి ప్రత్యేక సేవాకార్యక్రమాలు చేసారు. బాణసంచా ఉత్సవ ప్రచార సామగ్రితో అమ్మవారిని ఊరేగించారు. పలు పార్టీల నాయకులు గ్రామస్తులకు అమ్మవారి ఉత్సవాలు పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పెంటపాడు ఎస్ఐ స్వామి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కోలా శేషవేణి, ఉపసర్పంచ్ కోలా మార్కండేయులు, ఎంపీటీసీ సభ్యులు తోట నిరీక్షణరావులు ప్రత్యేక పూజలు చేశారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం



ఈపీఎఫ్ చర్చి లో చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న దైవసేవకులు

దైవసేవకులు మోజస్ ప్రవీణ్

పెంటపాడు: ఆధ్యాత్మికంగా విశ్వాసులు నవీన స్వభావంతో ఉంటూ దేవుని కృపను పొందాలని ఈపీఎఫ్ సంఘ సభ్యులు పాస్టర్ మోజస్ ప్రవీణ్ పేర్కొన్నారు. నూతన సంవత్సరం పురస్కరించుకొని పలు ప్రాంతాలలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. తణుకు ఇమ్మానియేలు ప్రార్థనా మందిరంలో పాస్టర్ మోజస్ ప్రవీణ్ దేవుని వాక్యం బోధించారు. భక్తులకు నూతన సంవత్సర శుభాకంక్షలు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనలు చేసారు. సంఘ సభ్యుల ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా క్రిస్మస్ పురస్కరించుకొని చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి ప్రతిభ కనర్చిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపకురాలు పి. అరుణకుమారి, దైవసేవకురాలు ప్రైజీ తదితరులు పాల్గొన్నారు.

గూడెం సెంటినరీ చర్చిలో

నూతన సంవ్సతర వేడుకలు రైల్వేస్టేషన్ రోడ్డులోని సెంటినరీ లూథరన్ చర్చిలో ఘనంగా నిర్వహించారు. సంఘ గురుమండల అధ్యక్షుడు డీఎల్ ఫీనెహాస్ ఆధ్వర్యంలో విశేష వందనార్పిత ఆరాధన చేసారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రత్యేక గీతాలు ఆలపించారు. చర్చి పాలక వర్గ సభ్యులు, పీసీసీ, ఎల్‌సీసీ సభ్యులు పాల్గొన్నారు. నియోజకవర్గంలో పలు క్రైస్తవ మందిరాల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. పెంటపాడు మండలం బి. కొండేపాడు గ్రామంలో సియోను ప్రార్థనామందిరం , రాచర్ల రూపాంతర దేవాలయం, భాగ్యలక్షిపేట ఎల్ఎల్ఎం చర్చి తదితర ప్రాంతాలలో వేడుకలు జరిగాయి.

నూతన ఆశయాలతో ముందుకు

పట్టణం, గ్రామాల్లో సందడిగా నూతన సంవత్సర వేడుకలు



తణుకు అర్బన్ ఎమ్మెల్సీ రవీంద్రనాథ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీవెంకట సుబ్బారావు తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నూతన సంవత్సర వేడుకలు పట్టణంలో ఘనంగా జరిగాయి. స్థానిక సవిత్రుపేటలోని వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురామ్ నాయుడు నివాసం వద్ద నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. వడ్డి రఘురామ్ నివాసం వద్ద కోలాహల వాతావరణం నెలకొంది. పట్టణ, రూరల్, పెంటపాడు గ్రామాల నుంచి, జిల్లా నలుమూలల నుంచి రైతులు, రైతు నాయకులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చి వడ్డి రఘురామ్ నాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు గజమాలలతో సత్కరించారు. రఘురామ్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, పంటలు పుష్కలంగా పండాలని, వ్యవసాయ, ఆక్వా రైతులకు మద్దతు ధర లభించేలా ప్రభుత్వం పెద్ద పీట వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైసీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ వంక నివాసంలో నూతన సంవత్సర వేడుకలు

తణుకు అర్బన్: ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ నివాసంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేకు కట్ చేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, ఎంపీపీ రుద్రా ధనరాజు, న్యాయవాది బలిజేపల్లి రవిశంకర్, వి.సీతారాం, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, వర్తక సంఘ నాయకులు ఉన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

తణుకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. న్యాయవాదులు కేకు కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ మాట్లాడుతూ సమాజంలో అందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో జూనియర్ న్యాయవాదులు తమ వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరచుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రామకృష్ణ, పొట్ల సురేష్, కె.వెంకటేశ్వర్లు, రమాదేవి, కామన మునిస్వామి, శౌరిధర్, మృత్యుంజయరావు, నెహ్రూ, వెంకటేష్, విజయకుమార్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం(టీఓసీ): రఘురాంకు శుభాకాంక్షలు చెబుతున్న మహిళలు



తణుకు బార్ అసోసియేషన్ భవనంలో కేకు కట్‌చేస్తున్న న్యాయవాదులు

ఏడు లక్షల గోవిందనామ జపం

పాలకొల్లు సెంట్రల్: ఉభయగోదావరి జిల్లాల గోవిందమాల కల్యాణ ఉత్సవ కమిటీ గురు గోవింద పీఠం ఆధ్వర్యంలో శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏడు లక్షల గోవింద నామ జపం చేశారు. బుధవారం నంబూరి భాగ్యలక్ష్మి, కొప్పిసెట్టి కల్యాణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో గోవింద నామ జపం చేశారు.